డీజీపీకి ఆహ్వానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా 428వ ఉరుసు మహోత్సవ ఆహ్వాన పత్రాన్ని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు దర్గా కమిటీ సభ్యులు మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఉరుసు మహోత్సవాలకు హాజరుకావాలని కోరారు. మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు. ఉరుసు మహోత్సవాలు ఈ నెల 9, 10, 11 తేదీలలో జరుగుతాయన్నారు. ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు ముక్తర్ అలీ, తబ్రేజ్ అలీ, మొహమ్మద్ అప్సర్, ఫైజాన్ పాల్గొన్నారు.

జెండా దిమ్మె ఆవిష్కరణ

తిరువూరు రూరల్: తిరువూరు ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా దిమ్మెను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరువూరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న 300 మంది కార్మికులకు నివేశన స్థలాలను కేటాయించి ఆర్టీసీ కాలనీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తిరువూరుకు రైల్వే మార్గం రాబోతోందన్నారు.

సత్తెమ్మకు విశేష పూజలు

త్రిలోచనాపురం(ఇబ్రహీంపట్నం): త్రిలోచనాపురం అటవీ శివారు ప్రాంతంలోని సతెమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వన సంరక్షణ సమితి సభ్యులు, స్థానిక ప్రజలు గ్రామ పొలిమేరలోని చింత చెట్టును సత్తెమ్మ అమ్మవారిగా భావించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా 600 మందికి అన్నదానం చేశారు.

మంత్రి ఇలాకాలో పారిశుద్ధ్యం ఇలా..


నూజివీడు పట్టణంలోని ఎన్నెస్పీ గేటు వద్ద పేరుకుపోయిన చెత్తచెదారం


బ్యాంకు స్ట్రీట్‌లో చెత్తకుప్పలు


సుతార్ల రామమందిరం సమీపంలో గృహాల మధ్య చెత్తచెదారం

నూజివీడు: మంత్రి కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. ఆదివారం వస్తే చాలు ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. పట్టణ పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తూ ఈగలు, దోమలు ముసురుకుంటున్నాయి. పురపాలక సంఘం పరిధిలో పర్మినెంట్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లతో కలిపి దాదాపు 150 మంది పారిశుద్ధ్య కార్మికులున్నప్పటికీ వారితో పని చేయించడంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్ విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలో మంత్రి పర్యటన ఉన్నప్పుడు పారిశుద్ధ్యం పేరుతో హడావుడి చేయడం తప్పితే మిగిలిన సమయంలో పారిశుద్ధ్యం నిర్వహణను గాలి కొదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలరే స్వయంగా పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదని పేర్కొనడం విశేషం. ఇప్పటికైనా పారిశుద్ధ్యం మెరుగుపడేలా మున్సిపల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నెట్‌బాల్ మహిళల టోర్నీకి కృష్ణా వర్సిటీ జట్టు



నూజివీడు: కృష్ణా విశ్వ విద్యాలయం నెట్‌బాల్ మహిళల జట్టును నూజివీడులోని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పీజీ స్టడీస్ ప్రిన్సిపాల్ జి.నవీన లావణ్యలత ఆదివారం ప్రకటించారు. ఎంపికైన ఈ జట్టు జనవరి ఏడు నుంచి తొమ్మిది వరకు జైపూర్‌లోని సురేష్ జ్ఞాన్ విహార్ యూనివర్సిటీలో నిర్వహించే అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల నెట్‌బాల్ మహిళల టోర్నమెంట్‌లో పాల్గొంటుందని చెప్పారు. ఎంపికైన జట్టు సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.స్రవంతి, జి.రేచల్, కె.సాయి దుర్గ, టి.మౌనిక, కె.వల్లిశ్రీ, బి.లిఖిత (ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), సీహెచ్ శ్రీజ, జి.ధనశ్రీ, వి.రమిత, బి.నవ్య (శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల), వి.శ్రీవర్షిత (ఆంధ్రా లయోలా కళాశాల), ఎస్.లీలాపద్మజ (ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ) ఎంపికయ్యారన్నారు.

కె. తాడేపల్లిలో అక్రమ మైనింగ్

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ రవాణాను స్థానికులు ఆదివారం అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. గ్రామంలో వసంతరాయల తిప్ప(కొండ)పై అక్రమ తవ్వకాలు జరుగుతుండగా స్థానికులు మెండెం జమలయ్య, చింతా సుధాకర్, ఉప్పలపాటి వెంకట్రావు, సింహాద్రి వెంకటనారాయణలు వెళ్లి అడ్డుకున్నారు. తహసీల్దార్‌కు సమాచారం అందించగా వీఆర్వో రంగారావు, వీఆర్ఏలను లారీ, జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు.

సంక్షిప్తంగా...

● అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని నిరసన

నూజివీడు: పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతు సంఘం సీనియర్ నేత కొమ్మన నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నేత చలసాని వెంకట రామారావుచ ప్రజా సంఘాల నాయకులు, అంబేడ్కర్ యూత్ నేతలు పాల్గొన్నారు.

● అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ధర్నా

నూజివీడు: స్థానిక డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ ఎం.దాసు అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ అధ్యక్షుడు కె.రాఘవ డిమాండ్ చేశారు. ఆదివారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈయూ డిపో ప్రధాన కార్యదర్శి ఈవీ కుమార్, ప్రెసిడెంట్ ఎం.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

● అపూర్వం.. ఆత్మీయ కలయిక

నూజివీడు: పట్టణంలోని డీఏఆర్ కళాశాలలో 1980–83లో బీఏ ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ లేబర్ వెల్ఫేర్ బ్రాంచి తొలి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రామన్నగూడెం రోడ్డులోని వైఎస్సార్ కాలనీ గెస్ట్‌హౌస్‌లో కలుసుకున్నారు. రిటైర్డ్ అధ్యాపకుడు కేవీ కృష్ణకుమార్ 27 మంది పూర్వ విద్యార్థులకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థి కేబీఎం రాజుకు ప్రతిభా పురస్కారం–2025ను అందజేశారు.

● లలిత కళల పరిశోధన విద్యార్థికి పీహెచ్‌డీ

ఇబ్రహీంపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం లలిత కళల (ఫైన్ ఆర్ట్స్) విభాగ పరిశోధన విద్యార్థి కొడాలి రవికుమార్ ఆదివారం పీహెచ్‌డీ అందుకున్నారు. ఈలప్రోలు గ్రామానికి చెందిన రవికుమార్ ఆచార్య మాచవరం ఆదినారాయణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు చేతుల మీదుగా విశాఖపట్నంలో డాక్టరేట్ పట్టా పొందారు.

● వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఇబ్రహీంపట్నం: వడ్డెర సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంక్షేమ సంఘం కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి కోరారు. ఇబ్రహీంపట్నంలో ఒడియ రాజుల సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 11న వడ్డెరుల ఆరాధ్య దైవం, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

● క్యాలెండర్ ఆవిష్కరణ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో న్యూ ఇయర్ క్యాలెండర్ ఆదివారం ఆవిష్కరించారు. సంస్థ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. ప్రజలంతా ప్రేమ, సహోదర భావంతో మెలగాలని సూచించారు. సంస్థ కార్యదర్శి సుమలత, సంఘ పెద్దలు అబ్రహాం, యోబు, మాణిక్యలరావు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

● విధిగా హెల్మెట్ ధరించాలి

తిరువూరు: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక బోసు బొమ్మ సెంటర్ వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వినియోగించని వారిపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



మైలవరంలో విస్తరిస్తున్న వైద్య రంగం

మైలవరం: మైలవరంలో వైద్య రంగం విస్తరిస్తోంది. గతంలో ఆర్ఎంపీలకే పరిమితమైన మైలవరం గత పదేళ్లలో ప్రైవేట్ వైద్యశాలలు విస్తరించి అన్ని వ్యాధులకు ఇక్కడే చికిత్సలు అందిస్తున్నారు. గతంలో ప్రతి చిన్న వ్యాధికి మైలవరం నుంచి విజయవాడకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడేవారు. ప్రైవేట్ వైద్యశాలల ఏర్పాటుతో ఆ ఇబ్బందులు తప్పాయి. విద్యారంగం కూడా అభివృద్ధి చెందుతోంది. ఎల్‌కేజీ నుంచి ఇంజినీరింగ్ వరకు చదువు పూర్తి చేసుకునే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో పెరిగిన విద్యాలయాలతో ఇతర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు మైలవరం వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో జనాభా పెరిగింది. కోవిడ్ తరువాత వైద్యం, విద్య, రియల్ ఎస్టేట్ తదితర వ్యాపార రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. మైలవరంలో బస్టాండ్ పక్కనే అత్యంత అధునాతన సదుపాయాలతో అమరావతి సీటీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. విజయవాడ రోడ్‌లో స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జనవరి ఒకటి నుంచి న్యూరాలజీ, కార్డియాలజీ వంటి అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలు, జ్యూయలరీ షాపులు ఏర్పాటు కావడంతో వ్యాపారపరంగా కూడా మైలవరం అభివృద్ధి చెందుతోంది.


అమరావతి స్కాన్ సెంటర్, మైలవరం


వివేకానంద హైస్కూల్, మైలవరం


మైలవరం ప్రధాన రహదారి


లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, మైలవరం


ధన్వంతరి ఆయుర్వేద వైద్యశాల, మైలవరం

అన్ని వ్యాధులకు చికిత్స



మైలవరంలో వైద్య రంగం బాగా అభివృద్ధి చెందింది. నిపుణులైన వైద్యుల ద్వారా అన్ని రోగాలకు ఇక్కడే వైద్యం దొరుకుతోంది. కార్పొరేట్ ఆస్పత్రులతో పాటు ఆయుర్వేదంపై ప్రజలు ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు.

– డాక్టర్ ఎం.సాయి శ్రీనివాసరెడ్డి, మైలవరం

వ్యాపారరంగం దినదినాభివృద్ధి



మైలవరం పట్టణం వ్యాపార రంగంలోనూ అభివృద్ధి సాధిస్తోంది. పట్టణంలో జ్యూయలరీ వ్యాపారానికి మంచి ఆదరణ కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల మహిళలతో సహా వారి ఇళ్లల్లో జరిగే శుభ కార్యాలకు మైలవరం వచ్చి బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తుంటారు. దీనితో వినియోగదారులకు శ్రమ లేకుండా అందుబాటు ధరలకే ఇక్కడ బంగారు ఆభరణాలు లభిస్తుండటం శుభపరిణామం.

– బయన శ్రీనివాసరావు, శ్రీజయలక్ష్మి జ్యూయలరీ అధినేత, మైలవరం